
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

గురువారం 17 అక్టోబరు 2024



ఎలికట్ట కార్యదర్శికి షోకాజ్ నోటీసు

షాద్‌నగర్‌రూరల్ అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినందుకు ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట పంచాయతీ కార్యదర్శి తేజస్వినికి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మూడు నెలల నుంచి సమావేశాలు నిర్వహించక పోవడం, గ్రామసభ మినిట్స్ పూర్తి చేయకపోవడం, పైప్‌లైన్ల మరమ్మతులు చేయించకపోవడంపై షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

కొత్తిమీర.. ప్రస్తుతం నిత్యావసర వస్తువు. ఏ కూర వండినా తప్పనిసరి. అందుకే కొత్తిమీరకు అన్ని కాలాల్లోనూ ఫుల్ డిమాండ్. చిన్న కట్ట కూడా రూ.20 - రూ.30 పలుకుతోంది. వేసవిలోనైతే రూ.50 పెట్టినా దొరకని పరిస్థితి. కొత్తిమీర విత్తనాలది(ధనియాలు) సుగంధ ద్రవ్యాలలో ప్రముఖ స్థానం. సాగులోనూ రైతులకు నిత్యం ఆదాయం తీసుకొచ్చే పంటగానూ గుర్తింపు పొందింది. 365 రోజులు సాగవుతూ, రైతన్న ఇంట కనక వర్షం కురిపిస్తోంది కొత్తిమీర. విత్తనాలు విత్తిన నెల రోజుల్లోనే పంట చేతికందుతుంది. అందుకే.. ఈ సాగును చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. చేవెళ్ల మండలం, కేసారంలో చేస్తున్న కొత్తిమీర సాగు.. లాభాలపై ప్రత్యేక కథనం.



రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి)

కొత్తిమీరతో కనకవర్షం!

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

వివరాలు 7లో..

- విత్తిన నెల రోజుల్లోనే పంట చేతికి..
- ముమ్మరంగా సాగు చేస్తున్న కేసారం రైతులు
- ఆ ఊళ్లో 80శాతం రైతులు ఇదే సాగు
- చేవెళ్ల, గుడిమల్కాపూర్ మార్కెట్‌లో విక్రయం



కేసారంలో కొత్తిమీర పంట



ఇబ్రహీంపట్నంలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్

₹3,95,71,640

ఉమ్మడి జిల్లాలో గురుకుల భవనాలకు అద్దె బకాయిలు

- సొంత బిల్డింగులు లేక అవస్థలు
- ఒకే భవనంలో రెండు గురుకులాలు
- ఏటా రూ. కోట్లలో అద్దె చెల్లింపులు
- సర్కారుకు పెరుగుతున్న ఆర్థిక భారం
- ఏడు నెలలకు 3 నెలల అద్దె మాత్రమే చెల్లింపు
- పేరుకుపోయిన 4నెలల బకాయిలు
- నెలనెలా భవన యజమానులతో వాదన

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు గత ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసింది. అయితే పూర్తిస్థాయి సౌలతులను కల్పించడంలో, సొంత భవనాలను నిర్మించడంలో ఎలాంటి శ్రద్ధ చూపలేదు. దీంతో చాలీచాలని సౌకర్యాలతో ప్రైవేటు భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ప్రైవేటు భవనాలకు రూ. లక్షల్లో అద్దె కట్టాల్సి రావడంతో ఆర్థిక భారం పెరుగుతోంది. సమయానికి అద్దె చెల్లించక పోవడంతో ప్రతీ నెలా భవన యాజమానులతో గొడవలు జరుగుతున్నాయి. బకాయిలు పెరిగి పోవడంతో బిల్డింగ్ ఓనర్లు గురుకుల పాఠశాలలు/కాలేజీలకు తాళం వేయాల్సిన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఏ నెలకు ఆ నెల అద్దె చెల్లించక పోవడంతో ఓనర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు వాపోతున్నారు. ప్రభుత్వ బకాయి కాబట్టి ఎప్పటికైనా డబ్బు వస్తుందని కొందరు యజమానులు ఓపిక పడుతుంటే.. మరి కొందరు మాత్రం నెలనెలా కిరాయి ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అద్దె చెల్లించడం లేదన్న కారణంతో భవన యజమానులు ఈ విద్యా సంస్థలకు తాళాలు వేశారు. ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకుంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందేమోనని ఆ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 62 గురుకుల పాఠశాలలు/కళాశాలలున్నాయి. అందులో 20 పాఠశాలు/కళాశాలలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగతా 42 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మొత్తం ఏడు నెలలకు సంబంధించిన బకాయిలు పేరుకు పోగా మూడు నెలలకు సంబంధించి తాజాగా అద్దె డబ్బులు చెల్లించినట్టు అధికారులు చెబుతున్నారు.. ఇంకా 4-5 నెలల అద్దె డబ్బులు రూ. 3.95 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో 7 గురుకుల పాఠశాలలు, నాలుగు గురుకుల

మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో..

గురుకుల పాఠశాలలు/ కళాశాలలు	62
అద్దె భవనంలో కొనసాగుతున్నవి	42
సొంత భవనాలు ఉన్నవి	20

అద్దె చెల్లించకపోవడంతో ఇబ్బందులు



చటాన్‌పల్లిలో సుమారు 10 ఎకరాల్లో గురుకుల పాఠశాల, కళాశాల కోసం భవనాన్ని అద్దెకు ఇచ్చాను. కానీ సకాలంలో అద్దె చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుంది. దీని వల్ల పాఠశాలల నిర్వహణ కూడా భారంగా మారుతుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి 5 శాతం అద్దె పెంచాల్సి ఉంది. అది కూడా అమలుకు నోచుకోవడం లేదు. సకాలంలో అద్దె చెల్లించకుంటే కొంత గడువు ఇచ్చి పాఠశాలను ఖాళీ చేయిస్తాం.

- శ్రీవర్ధన్‌రెడ్డి, బీసీ గురుకుల పాఠశాల భవనం యజమాని, చటాన్‌పల్లి

పంజాగూడలో టాటా ఏటీసీ

- రెండెకరాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు
- భూ కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి
- సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు

7



వృద్ధ దంపతుల దారుణ హత్య

కందుకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. పొట్టకూటి కోసం వలస వచ్చిన వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారు. ఈ విషాదకర సంఘటన కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి మూగ ఊషయ్య(75)- శాంతమ్మ(65) దంపతులు కొత్తగూడలోని వ్యవసాయ క్షేత్రంతో మూడేళ్లుగా వాచ్‌మెన్ డ్యూటీతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యవసాయ క్షేత్రం యజమాని మనోహర్‌రావు ఎప్పటిలా బుధవారం ఉదయం ఊషయ్యకు ఫోన్ చేయగా సమాధానం రాలేదు. దాంతో దగ్గర్లోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన మహేశ్ అనే రైతు ఫోన్ చేసి ఊషయ్య దగ్గరకు వెళ్లి చూడమని పురమాయించాడు. మహేశ్ వెళ్లే సరికి శాంతమ్మ ఇంట్లోనే చనిపోయి ఉంది. మరో వంద మీటర్ల దూరంలో ఊషయ్య కూడా విగతజీవిగా పడున్నాడు. పోలీసులు వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ క్షేత్రంలోకి వచ్చి శాంతమ్మ గొంతు కోసి హత్య చేశారని, ప్రాణాలు కాపాడుకునేందుకు పారిపోవాలని చూసిన ఊషయ్య వెంబడించి వెనుకనుంచి మెడపై కత్తితో బలంగా కొట్టి చంపేసి ఉంటారని పోలీసులు అంచనా వేశారు.

కొత్తగూడలో ఘటన



ఊషయ్య, శాంతమ్మ(ఫైల్)

గింజపట్టని మొక్కజొన్న పైరు

పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కేశంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల గ్రామంలో గింజపోయని మొక్కజొన్న పైరును రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేతలు బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు లంకాల సురేష్ రెడ్డి, చేగూరి శ్రీశైలం, సూరి వెంకటేష్, తిరుమల్ రెడ్డి రవీందర్, చెన్నయ్య, మహేందర్, మల్లేష్, పాండు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఒక కంకి వచ్చే దగ్గర మూడు, నాలుగు కంకులు వచ్చాయని, వాటికి గింజలు సరిగా రాలేదని వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సైంటిస్టులు నాగేష్, మల్లయ్య ఆ పంటలను పరిశీలించారు. పంట నష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఏడీఏ రాజారత్నం, ఏవో శిరీష, ఏఈవో వినయ్ పాల్గొన్నారు.

జిల్లాలో నేడు

బీఆర్ఎస్వీ విస్తృత స్థాయి సమావేశం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నేడు (గురువారం) బీఆర్ఎస్వీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

నియామకం

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మంద పాండు

కందుకూరు,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన మంద పాండును బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. బుధవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఎస్సీ మోర్చాలో రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులకు పాండు కృతజ్ఞతలు తెలిపారు



నియామక పత్రాన్ని అందుకుంటున్న పాండు

నరకయాతన



గోతులమయంగా మూడు జిల్లాలను కలిపే రోడ్డు

- అడుగడుగునా గోతులు.. అవస్థల్లో వాహనదారులు
- 10 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ ప్రతిపాదనలకే పరిమితం
- అసంపూర్తిగా మూడు జిల్లాలను, రెండు జాతీయ రహదారులను కలిపే రోడు
- మరమ్మతులకూ నోచక తరచూ ప్రమాదాలు

అధ్వానంగా జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు

ఆమనగల్లు ,అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి) ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడై ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. మూడు జిల్లాలు, రెండు జాతీయ రహదారులను కలిపే ఆమనగల్లు- చారగొండ ప్రధాన రహదారి మధ్యలో విస్తరణ, మరమ్మతు, ఆధునికీకరణ గురించి ఏళ్ల కాలంగా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో అడుగడుగునా బీటీ కొట్టుకుపోయి, కంకర తేలి, గోతులు ఏర్పడి రోడ్డు అధ్వానంగా మారింది. దెబ్బతిన్న రోడ్డుపై వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పిస్తున్నట్లు ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ అందుకనుగుణంగా చర్యలు చేపట్టడం లేదనడానికి జంగారెడ్డి పల్లి- చంద్రాయన్‌పల్లి పాడైన

మిగతా 8వ పేజీలో...

వృత్తిదారుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వృత్తిదారుల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో 394 మంది లబ్ధిదారులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో తాటి, ఈత వనాలు పెంచడానికి ఐదెకరాల చొప్పున ప్రభుత్వ భూమిని కేటాయించాలని గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కోరారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తాటిచెట్లు నరకకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి రమేష్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, నాయకులు పాశం లక్ష్మీపతిగౌడ్, ఈసీ శేఖర్‌గౌడ్, కృష్ణగౌడ్, దానుగౌడ్, ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సేఫ్టీ కిట్లను పంపిణీ చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అంధత్వాన్ని జయించి.. కొలువు సాధించి!

- చిన్నప్పుడే చూపు కోల్పోయిన రాఘవేందర్
- బ్రెయిలీ లిపి ద్వారా ఉన్నతవిద్య
- ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన తలకొండపల్లి మండలం పడకల్ గ్రామవాసి



రాఘవేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన బట్టు రాఘవేందర్. చిన్నతనంలోనే చూపు కోల్పోయినా పట్టుదలతో చదివాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. బుధవారం తలకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టాడు. రాఘవేందర్ పడకల్ గ్రామంలో ప్రాథమిక విద్య, ఆ తర్వాత మహబూబ్ నగర్‌లో అంధుల ఆశ్రమ పాఠశాలలో 8 నుంచి పదవ తరగతి వరకు, హైదరాబాద్ ఉప్పల్ జీఎల్ఆర్ జూనియర్ న్యూమోడల్ కళాశాలలో ఇంటర్, నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఈస్ట్ మారేడుపల్లి విజువల్లీ ట్రైనింగ్ సెంటర్‌ఫర్ ది టీచింగ్ ట్రైనింగ్ కళాశాలలో స్పెషల్ డీఎడ్ పూర్తి చేశాడు. బ్రెయిలీ లిపీ ద్వారా ఉన్నత విద్య కొనసాగించాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించి డీఎస్సీ పరీక్ష రాసిన రాఘవేందర్ ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించాడు. ఈ సందర్భంగా రాఘవేందర్‌ను సీపీఎం మండల కమిటీ నాయకులు దుబ్బ చెన్నయ్య, సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, సీపీఎం పడకల్ గ్రామ కార్యదర్శి రమేశ్, జంగయ్య సత్కరించి అభినందించారు.

సిరిగిరిపేట్‌లో ఉద్రిక్తత

- రియల్టర్లతో గ్రామస్తుల వాగ్వాదం
- ప్రభుత్వ భూమి జోలికి రావద్దంటూ హెచ్చరిక





రియల్టర్ల లారీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

తాండూరు రూరల్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిరిగిరిపేట్ గ్రామంలో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన రియల్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. గ్రామ శివారులోని సర్వే నంబర్-105, 106 లో 26ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఏడాదిన్నర క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాల చొప్పున వేలం నిర్వహించి అమ్మేసింది. ఒక్కో ఎకరా రూ.16లక్షల చొప్పున కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ భూమిని రియల్టర్లకు అమ్ముకున్నారు. కొనుగోలు చేసిన రియల్టర్లు బుధవారం సిరిగిరిపేట్ శివారులోని ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారు. హద్దులు కూడా ఏర్పాటు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి వెళ్లి వారిని అడ్డుకున్నారు. గ్రామంలో పేదలు ఉన్నారని వారికి ఇంటి స్థలం లేదని, కావున ఆ భూమిని పేదల ఇంటి స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. అప్పటి వరకు ప్రభుత్వ భూమిలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించొద్దని గ్రామస్తులు రియల్టర్లను హెచ్చరించారు.

'మహేశ్వరం' అభివృద్ధికి రూ.17 కోట్లు

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్


మంత్రి శ్రీధర్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి రూ.17 కోట్లు మంజూరైనట్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి కేఎల్లార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఈ నిధులను ఉపయోగించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఫోర్త్‌సిటీ, ఫార్మా, మెట్రో కారిడార్, విద్య, వైద్యహబ్‌ల ఏర్పాటుతో మహేశ్వరం మహానగరంగా మారనుందన్నారు. అన్ని రకాల పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేస్తుండటం స్థానిక ప్రజల అదృష్టమన్నారు. ఇప్పటికే ఫాక్స్‌కాన్‌వంటి అంతర్జాతీయ కంపెనీలతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పదేళ్లుగా మహేశ్వరం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనం వృథా చేసి అవినీతికి పాల్పడ్డ సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు.

అంబేడ్కర్ విగ్రహానికి సీతాఫల గుజ్జు పూసిన దుండగులు

ఆందోళన చేసిన అంబేడ్కర్, దళిత సంఘాల నేతలు


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి - నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన మాల్‌లో సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు సీతాఫల గుజ్జు పూయడంతో అది నల్లగా మారిపోయింది. దీనిని బుధవారం కొందరు యువకులు గమనించి అంబేడ్కర్ సంఘాల నాయకులకు వివరించారు. దాంతో యాచారం మండలంలోని మాల్, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, తమ్మలోనిగూడ, నల్లవెల్లి గ్రామాలకు చెందిన అంబేడ్కర్ సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు కార్యకర్తలు దుండగులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో మాల్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారమందుకున్న ఏసీపీ కేపీవీ రాజు, సీఐ శంకర్‌కుమార్ ఉసంఘటనా ప్రదేశానికి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడి సముదాయించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దుండగులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఏసీపీ రాజు క్షీరాభిషేకం చేసి పూలదండ వేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జగన్, ఎస్టీ సంఘ నాయకులు చందూనాయక్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చందూనాయక్, గాలయ్య ఉన్నారు.

రెండు షిఫ్టుల పనిని నిరసిస్తూ మున్సిపల్ కార్మికుల ఆందోళన


మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఘట్‌కేసర్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కార్మికులను రెండుపూటల పని చేయాలని వేధింపులకు గురి చేయడం మానుకోవాలని రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ఉపాధ్యక్షుడు కల్లూరి జయచంద్ర డిమాండ్ చేశారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ ఇష్టానుసారంగా పని చేయించాలనుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం, సాయంత్రం గానీ 8గంటల చొప్పున కార్మికులు పని చేస్తున్నారని గుర్తు చేశారు. కానీ ఇక్కడ ఉదయం 4 గంటలు, సాయంత్రం 4గంటలు పని చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైన కమిషనర్ స్పందించి గతంలో మాదిరిగానే ఒకే షిఫ్టులు 8 గంటల పని చేయించాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎండీ పాబేర్ అలీని వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు షిఫ్టుల పని విధానమే కొనసాగుతున్నదని ఇక్కడ అలాగే పని చేయించాలని ఈమేరకు మున్సిపల్ పాలకవర్గం తీర్మాణించినందున కార్మికులను రెండు షిఫ్టుల్లో 8గంటలు పని చేయాలని సూచించినట్లు తెలిపారు.



వైభవంగా ఎల్లమ్మ బోనాలు

శామీర్‌పేట, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): డోలు దరువు, శివసత్తుల పూనకాలతో ఉత్సాహంగా రేణుక ఎల్లమ్మతల్లికి బోనాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని ఎల్లమ్మతల్లి ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఎల్లమ్మతల్లి, మాతమ్మలకు రెండు బోనాల చొప్పున గౌడ కులస్తులతో పాటు గ్రామంలోని అందరి భక్తులు బోనాలను అమ్మవార్లకు సమర్పించారు. జోగిని అనురాధ, ప్రవీణ్‌గౌడ్‌లు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అలాగే అమ్మవారికి ఒడిబియ్యం పోసి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

కొత్తిమీరతో కనకవర్షం!


కోత దశకు చేరుకున్న కొత్తిమీర

- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- విత్తిన నెల రోజుల్లోనే పంట చేతికి..
- ముమ్మరంగా సాగు చేస్తున్న కేసారం రైతులు
- ఆ ఊళ్లో 80శాతం రైతులు ఇదే సాగు
- చేవెళ్ల, గుడిమల్కాపూర్ మార్కెట్‌లో విక్రయం

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో నెలన్నర వ్యవధిలో చేతికొచ్చే కొత్తిమీరను సాగు చేస్తూ రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. చేవెళ్ల మండలం, కేసారంలో 80 శాతం మంది రైతులు కొత్తిమీర పంటనే సాగు చేస్తున్నారు. మిగతా 20 శాతంలో 10 శాతం పూదీన, మరో పది శాతం పాలకూర, తోటకూర, మెంతు కూర సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి పంటలకు బదులుగా ఈ సాగు చేస్తున్నారు. సుమారు 200 మంది రైతులు కొత్తిమీర పంట సాగుపై మక్కువ చూపుతూ మిగతా గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.


డ్రిప్‌తో సాగు చేస్తున్న కొత్తిమీర

కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్తిమీర పంట దెబ్బతింది. అయినా దుక్కులు దున్ని అరెకరా నుంచి రెండెకరాల వరకు సాగు చేస్తున్నారు. ఆధునిక పద్ధతులతో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. పెట్టుబడిగా ఎకరాకు సుమారు రూ.15 - 20 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ప్రస్తుతం సాగు చేసిన వారిలో కొంత మంది రైతుల వద్ద మొలక దశలో ఉండగా మరికొందరి వద్ద పెద్ద సైజు వరకు పెరిగింది. దీపావళి పండగ వరకు పంట చేతికి వచ్చేలా సాగు చేస్తున్నారు. ఈ దిగుబడిని చేవెళ్లలోని వ్యవసాయ మార్కెట్, గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు.

మంచి లాభాలు వస్తున్నాయ్



ఇతర పంటలతో పోలిస్తే కొత్తిమీర పంటకు అయ్యే ఖర్చు చాలా తక్కువ. అన్ని సీజన్లలో కొత్తిమీరకు మంచి డిమాండ్ ఉంటుంది. 40 ఏళ్ల నుంచి కొత్తిమీర సాగు చేస్తున్నాను. పెట్టుబడి తక్కువ.. లాభాలు బాగుండటంతో ఇదే సాగు చేస్తున్నాను. ఈ ఏడాది కొత్తిమీరకు మంచి ధర పలుకుతోంది. కానీ.. ఇటీవల కురిసిన వర్షానికి రెండెకరాల్లో పంట పాడైంది. రూ.50 వేలకు పైగానే పెట్టుబడి పెట్టాను. గతేడాది మంచి లాభాలు వచ్చాయి. సుమారు రెండు లక్షల వరకు లాభం వచ్చింది.

- ముష్టి నారాయణ, రైతు, కేసారం

అన్ని సీజన్లలో సాగు చేయొచ్చు



30 ఏళ్ల నుంచి కొత్తిమీరతో పాటు పాలకూర, తోట కూర సాగు చేస్తున్నాను. ఈ సారి ఎకరం పొలంలో డ్రిప్ పద్ధతి ద్వారా కొత్తిమీర సాగు చేశాను. రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టాను. మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నాను. గతేడాది లక్ష రూపాయల వరకు లాభం వచ్చింది. పంట ఏడాదిలో మూడు సార్లు వేసుకోవచ్చు. దీన్ని అన్ని సీజన్‌లలో సాగు చేసుకునేందుకు అవకాశముంది.

- బాల్‌రెడ్డి, రైతు, కేసారం

₹ 3,95,71,640


యాచారం బీసీ గురుకుల పాఠశాల

5వ పేజీ తరువాయి...

కళాశాలలు ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాల ప్రభుత్వ భవనంలో కొనసాగుతుండగా, మిగతా అన్ని గురుకులాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి నెలకు రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ప్రభుత్వం అద్దె చెల్లించాల్సి ఉంది. కానీ ఏడు నెలలుగా అద్దె చెల్లించలేదు. ఈ నెలలోనే మూడు నెలల అద్దెను చెల్లించారు. ఇంకా రూ. 1.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇబ్రహీంపట్నంలో మొత్తం 6 రెసిడెన్షియల్ పాఠశాలలు/కళాశాలలు ఉన్నాయి. అందులో నాలుగింటికి సొంత భవనాలున్నాయి. రాజమహేంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఖైరతాబాద్, చంద్రాయన్ గుట్టకు చెందిన జ్యోతిబాఫూలే బాలికల గురుకులాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. వీటికి నెలకు రూ.12 లక్షల చొప్పున అద్దె ఉండగా నాలుగు నెలల నుంచి రూ.48 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. మంచాల మండలంలోని 4 గురుకుల పాఠశాల/కళాశాలు ఉండగా అందులో మూడు గురుకులాలకు పక్కా భవనాలు ఉన్నాయి. నోములలో బీసీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. నెలకు రూ.7.50 లక్షల చొప్పున 4 నెలలకు రూ.30 లక్షలు అద్దె పెండింగ్‌లో ఉంది. యాచారం మండలంలో 4 రెసిడెన్షియల్ పాఠశాలు/కళాశాలలున్నాయి. బీసీ, ఎస్సీ గురుకులాలు రెండు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నెలకు రూ.4 లక్షల చొప్పున 5 నెలలకు సంబంధించి రూ.20 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. చేవెళ్ల మండలంలో మొత్తం 10 గురుకుల పాఠశాలలు/కళాశాలలు ఉన్నాయి. చేవెళ్లలోని గురుకుల పాఠశాల (మియాపూర్)కు ప్రతి నెలా అద్దె రూ.5.87 లక్షలు ఉండగా నాలుగు నెలలకు సంబంధించి రూ.23.51 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ముడిమ్యాల రెవెన్యూ పరిధి కొనసాగుతున్న (కొడంగల్) కాలేజీకి నెలకు రూ.4 లక్షల చొప్పున నాలుగు నెలలకు సంబంధించి రూ.16 లక్షలు అద్దె రావాల్సింది ఉంది. ధర్మసాగర్‌లోని బీఎస్ఐటీ కాలేజీలో కొనసాగుతున్న (నవాబుపేట, ఇందులోనే వికారాబాద్, చేవెళ్ల ఇంటర్మీడియట్ కాలేజీలు న్నాయి) ప్రతీ నెల 3.83 లక్షలు చెల్లించాల్సి ఉంది. 4 నెలలకు సంబంధించిన అద్దె రూ. 15.35 లక్షలు చెల్లించాల్సి ఉంది. సాగర్ ఇంజనీరింగ్ కాలేజీలో కొడంగల్‌కు సంబంధించిన బాలికల పాఠశాల కొనసాగుతోంది. ఇందులోనే కొడంగల్, పరిగి వికారాబాద్‌కు చెందిన బాలికల ఇంటర్మీడియట్ కొనసాగుతున్నాయి. దీనికి నెలకు అద్దె రూ.7.85 చెల్లిస్తున్నారు. అయితే, దీనికి 4 నెలలకు సంబంధించి రూ. 31.42 లక్షలు బిల్లులు పేరుకుపోయాయి. వికారాబాద్ జిల్లా పరిగిలో ఐదు రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఎస్టీ, ఎస్టీ గురుకులాలకు సొంత భవనాలున్నాయి. బీసీ బాలికల, బాలుర, మైనారిటీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలకు మూడు నెలలకు రూ.76.69 లక్షలు అద్దె బకాయిలు పేరుకుపోయాయి. తాండూరులో మూడు గురుకులాలు ఉండగా వాటికి సొంత భవనాలు ఉన్నాయి. పెద్దేముల్‌లోని బీసీ గురుకులం అద్దె భవనంలో నడుస్తోంది. ఈ భవనానికి మూడు నెలల రూ. 6 లక్షల అద్దె పెండింగ్‌లో ఉంది. వికారాబాద్ మండలంలో మూడు గురుకులాలు ఉండగా అందులో రెండు అద్దె భవనాలు. ఈ రెండు భవనాల అద్దె రూ.42 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కొడంగల్‌లో మూడు గురుకులాలు ఉండగా ఒక గురుకులం అద్దె భవనంలో కొనసాగుతోంది. దానికి మూడు నెలల అద్దె రూ.3.60 లక్షలు చెల్లించాల్సి ఉంది. మేడ్చల్ జిల్లాలో 12 గురుకుల పాఠశాలు/కళాశాలలు ఉన్నాయి. ఇవన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి ఏడు నెలల అద్దె పెండింగ్‌లో ఉండగా మంగళవారం మూడు నెలల అద్దె చెల్లించారు. ఇంకా 4 నెలలకు సంబంధించి రూ.1.20 కోట్లు అద్దె పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా ఆయా మండలాలు, నియోజకవర్గాల్లో ఉండాల్సిన గురుకులాలు భవనాలు లేని కారణంగా మరో నియోజకవర్గం, మండలాల్లో కొనసాగుతున్నాయి. బిల్డింగ్‌ల కొరత కారణంగా ఒక్క బిల్డింగ్‌లోనే రెండు చొప్పున గురుకులాలు కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేవు.

భారంగా మారుతున్న నిర్వహణ



నెలల తరబడి అద్దె చెల్లించకపోవడం వల్ల గురుకుల పాఠశాలలో మెయింటెనెన్స్ కూడా భారంగా మారుతుంది. నెలకు రూ. 2 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉంది. ఆరు నెలలకు ఒక సారి కూడా అద్దె చెల్లించడం లేదు. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి 5 శాతం అద్దె పెంచమని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. సకాలంలో అద్దె చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మంగులాల్ నాయక్, కొందుర్గు ఎస్సీ గురుకులపాఠశాల భవన యజమాని

రెండు నెలల రెంట్ చెల్లించాం



మార్చి, ఏప్రిల్ నెలకు సంబంధించిన పాఠశాల/కళాశాల రెంటు రూ.15.10 లక్షలు బిల్డింగ్ ఓనర్ ఖాతాలో జమ చేశాం. మే, జూన్, జూలై, ఆగస్టు సెప్టెంబర్ నెలలకు సంబంధించిన రెంటు చెల్లించాల్సి ఉంది.

- ఖుర్షీద్, కొందుర్గు ఎస్సీ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్

విద్యుత్ షాక్‌తో ఇరిగేషన్ ఉద్యోగి మృతి

కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వల సర్వే చేస్తుండగా ఘటన


ఇస్మాయిల్(ఫైల్)

ధారూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి సాగునీటి ప్రాజెక్టు కాలువల సర్వే చేస్తుండగా సర్వే పరికరంపైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలి సాగు నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి షాక్‌తో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని నాగసమందర్ గ్రామ సమీపంలోని ప్రాజెక్టు కాలువ వద్ద బుధవారం జరిగింది. స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండలం, ఎన్కెపల్లి గ్రామానికి చెందిన ఎండీ. ఇస్మాయిల్(35) సాగు నీటిపారుదల శాఖలో లష్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువల ఆధునీకరణలో భాగంగా ఇరిగేషన్ డీఈఈ భాస్కర్ గౌడ్, ఏఈఈ మాధురిలత, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ముకుంద్, రవీందర్, పాండు, సాయి, లష్కర్‌లు ఇస్మాయిల్, చిట్లపల్లి రాములు, బంటు రాములు అంతా కలిసి సర్వే నిర్వహిస్తున్నారు. నాగసమందర్ సమీపంలోని కల్వర్టుకు కొద్ది దూరంలో ప్రాజెక్టు కాలువ సర్వే కోసం సర్వే పరికరం(రీడింగ్ స్టాఫ్ హ్యాండిల్)తో ఇస్మాయిల్ వెళ్తున్నాడు. ఇస్మాయిల్ చేతిలో ఉన్న సర్వే పరికరను పైకి లేపే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. ఈ ప్రమాదంలో విద్యుత్ షాక్‌తో ఇస్మాయిల్ అక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడున్న అధికారులు ఆయనను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య అలీమా బేగం ఇచ్చిన పిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్రికల్చర్ కోర్సులతో మంచి భవిష్యత్

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ కోర్సులు చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని మల్లారెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచానికి అన్నం పెట్టే గొప్ప రంగం వ్యవసాయమన్నారు. ఈ రంగంపై అధ్యాయనం చేసే అవకాశం కేవలం అగ్రికల్చర్ కోర్సులు చదివిన విద్యార్థులకే సాధ్యమన్నారు. కొత్త పరిశోధనలు చేపట్టి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఐకార్, ఏటీఆర్ఐ షేక్ ఎన్. మీరాన్, మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, డీన్ రాజారెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి తెల్లబంగారం

తాండూరు/బషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పత్తి పంట (తెల్ల బంగారం) ఆశాజనకంగా ఉంది. వర్షాలు పడి కొంత మేరకు పంట నష్టం జరిగిన దిగుబడి బాగానే ఉంది. తాండూరు నియోజకవర్గంలో అన్ని పత్తి మిల్లులలో పత్తి కొనుగోళ్లను వ్యాపారులు ప్రారంభించారు. కాగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకు పత్తిని విక్రయించి నష్టపోతున్నారు. తాండూరు నియోజకవర్గంలో 43,800 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఈ సీజన్ ప్రారంభంలో భారీ వర్షాలు, వాతావరణ మార్పులతో ఇప్పటికే పత్తికి నష్టం వాటిల్లగా, రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను మరింత కృంగదీస్తున్నాయి. తడిసిన పత్తిని ఇంట్లో నిల్వచేసుకోలేక, పత్తి మిల్లులకు తరలిస్తున్నారు. మరోపక్క పత్తి రాక ప్రారంభం కావడంతో తమ అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. క్వింటాల్ పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉండగా, జిన్నింగ్ మిల్లుల్లో వ్యాపారులు తేమశాతం పేరిట రూ.6,200 నుంచి రూ.7,200 వరకు కొనుగోలు చేస్తున్నారు. రోజుకు ఒక్కో మిల్లుకు 300 క్వింటాళ్ల వరకు పత్తి విక్రయానికి వస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో పెద్ద ఎత్తున పత్తి మార్కెట్‌లోకి రానుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి త్వరగా పత్తి కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.


లేగ దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్, (ఇన్‌సెట్)పొలంలో గుర్తించిన చిరుత అడుగు

లేగదూడపై చిరుత దాడి

- భయాందోళనలో రేండ్లగడ్డ తండావాసులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్‌వో

యాలాల, అక్టోబర్ 16 : పొలం వద్ద కట్టేసిన లేగ దూడపై చిరుతపులి దాడి చేసి చంపింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి యాలాల మండల పరిధిలోని రేండ్లగడ్డ తండా సమీపంలో జరిగింది. తండాకు చెందిన రైతు గోప్యానాయక్ తన పొలంలో 15 రోజుల క్రితం వేరుశనగ విత్తనాలు వేశాడు. ఒక ఎద్దు, లేగ దూడ, మూడు ఆవులను పొలం వద్దే కట్టేసి ఇంటికి వస్తున్నాడు. రోజూమాదిరిగానే బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా, లేగ దూడను ఏదో గుర్తు తెలియని జంతువు చంపి తిన్నట్లుగా గుర్తించాడు. విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయగా, తండావాసులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. అక్కడికి చేరుకున్న అధికారులు పొలంలో అటవీ జంతువు పాదాలను గమనించారు. ఆ పాద ముద్రలు చిరుతవేనని గుర్తించారు. దాడి చేసిన సమయంలో అక్కడున్న ఆవులు, ఎద్దు తాడును తెంచుకుని పారిపోగా, లేగదూడ మెడకు ఉన్న తాడు బలంగా ఉండటంతోనే తెంచుకో లేకపోయిందని గుర్తించారు. అయితే లేగ దూడను చంపింది చిరుత పోలికలేనని, తండావాసులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజేందర్ సూచించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన యాలాల ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటరిగా రాత్రివేళల్లో బయటకు వెళ్లరాదని, ఏదైనా సంఘటన జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలకు పాకడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్రభయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బషీరాబాద్: రేళ్లగడ్డ తండాలో చిరుత సంచారిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించినందున మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బషీరాబాద్ ఎస్ఐ ఏం.ఎ.గఫార్ సూచించారు. మండలంలోని మైల్వార్, నీళ్లపల్లి, దామర్‌చెడ్, గొట్టిగకలాన్ లటవీ ప్రాంతం యాలాల మండలం జుంటుపల్లి ఫారెస్టు సెక్షన్ కిందకు వస్తుందన్నారు. అటవీ గ్రామాల ప్రజలు రాత్రి వేళ జాగ్రత్తగా ఉండాలన్నారు. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పంజాగూడలో టాటా ఏటీసీ

- రెండెకరాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు
- భూ కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి
- సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు

కందుకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో వృత్తివిద్య నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు అక్కడే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో కలిసి తొలి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను నెలకొల్పనుంది. మండంలోని పంజగూడ రెవెన్యూలో 90 సర్వేనెంబరు లోని రెండు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం టీఎస్ఐఐసీ అధికారులు, కందుకూరు మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు.

- ఏటీసీ ఏర్పాటుకు రూ.42.64 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో టాటా టెక్నాలజీ లిమిటెడ్ రూ.31.01 కోట్లు వ్యయం చేయనుంది. ఈ నిధులతో ఏటీసీ ఏర్పాటుకు అవసమైన సాఫ్ట్‌వేర్, యంత్రాలు, మానవవనరులను సమకూర్చనుంది. నిర్మాణ పనులు, విద్యుదీకరణ, ఇతర ఖర్చుల కింద మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించనుంది. ఈ ఏటీసీలో రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అందులో 244 సీట్లు అందుబాటులో ఉంటాయి.
- ఆయా కోర్సుల్లో వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. టీటీఎల్ సంస్థ ఐదేళ్ల పాటు ఏటీసీలకు అవసరమైన సాంకేతికత, ఇతర మానవ వనరులను సమకూరుస్తుంది. ఐదేళ్ల తర్వాత మారుతున్న పరిణామాలకు అనుగూనంగా కొత్త కోర్సులు , సాంకేతికత, ఇతర మానవ వనరుల కోసం ఒప్పందాన్ని పొడిగించుకునే అవకాశాలున్నాయి. ఏటీసీల్లో చదువుకున్న వారికి తప్పనిసరిగా ఉపాధి లభించేలా ఉపాధి కల్పన శాఖ తగు చర్యలు తీసుకుంటుందని కార్మికశాఖ వర్గాలు పేర్కొన్నాయి.


టాటా టెక్నాలజీస్ ఏటీసీకి కేటాయించిన భూమి

వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి..

వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే కోర్సుల్లో అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ మిషనింగ్ టెక్నీషయన్ కోర్సుకు సంబంధించి 48 సీట్లు, ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్- 20 సీట్లు, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్ (మెకానికల్)- 48 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ - 40 సీట్లు, మెకానికల్ -48 సీట్లు, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్-40 సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

అఘాయిత్యాలను అరికట్టాలి : బక్కని

షాద్‌నగర్ అర్బన్, 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకూ పెరుగుతున్న నేరాలు, ఘోరాలను అరికట్టాలన్న ఆలోచన ప్రతీ ఒక్కరికి రావాలని, అందరి బాధ్యతగా భావించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతన్న అఘాయిత్యాలు, హత్యలు, దొంగతనాలు, అక్రమాలకు గల కారణాలు, అరికట్టడానికి ఉన్న అవకాశాలపై బక్కని మేధావులు, విద్యార్థులతో చర్చిస్తున్నారు. బుధవారం స్థానిక బీఏఎం డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పాటు మేధావులతో చర్చించారు. ప్రభుత్వాలు చట్టాల్లో మార్పులు తెచ్చి, అరెస్టులు చేసి, జైలులో పెట్టినా సమాజంలో భయం పెరగడం లేదని, నేర ప్రవృత్తి తగ్గడం లేదని అభిప్రాయపడ్డారు. మూలాలను అన్వేషించి, విద్యార్థుల నుంచే మార్పు తేవడానికే తాను ప్రయత్నం మొదలుపెట్టానని తెలిపారు.

కనుల పండువగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠ

నందిగామ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ దేవతల విగ్రహ పున ప్రతిష్ఠ కార్యక్రమాలను బుధవారం వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మహిళలు పెద్దఎత్తున బొడ్రాయికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఈట గణేష్, శివశంకర్‌గౌడ్, వంకాయల నారాయణరెడ్డి, జిల్లెల్ల రాంరెడ్డి, జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, వంకాయల రామన్న, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, విఠల్, తదితరులున్నారు.

రహదారుల విస్తరణకు బ్రేక్!

- ముందుకు సాగని నాలుగు లేన్ల రోడ్ల పనులు
- ప్రారంభించి ఏడాదైనా పూర్తికాని వైనం
- యాచారం మండలంలో రోడ్ల విస్తరణ పనులకు మోక్షమెప్పుడో?
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



మీర్‌ఖాన్‌పేట నజ్దిక్‌సింగారం గ్రామాల మధ్య గుంతలమయంగా రహదారి

యాచారం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన ఫార్మాసిటీ రోడ్డు పనులు మధ్యంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం పనులు చేపట్టగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్అండ్‌బీ రోడ్డు పనులు ఆగిపోయాయి. కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా విస్తరణ పనులు చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.78 కోట్లు కేటాయించింది. నందివనపర్తి నుంచి మేడిపల్లి ఫార్మాసిటీ వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణకు రూ.48 కోట్లు కేటాయించింది. శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట సమీపం వరకు రూ.32 కోట్ల నిధులతో నాలుగు లేన్ల రహదారి పూర్తయింది. అయితే, ఈ రహదారిపై పలుచోట్ల డివైడర్లు పాడైపోయాయి. రోడ్డు పనుల పూర్తికి నిధులు కేటాయించారా? లేకపోతే అసలు విడుదల కాలేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బీటీ రహదారిని మట్టి రోడ్డుగా మార్చి..

మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరించడానికి రూ.78 కోట్లతో పనులు చేయాలని అధికారులు గతంలో నిర్ణయించారు. మూడు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డును పూర్తిగా తొలగించి మట్టి రోడ్డు వేశారు. ఏడాది కాలంగా పనులు ముందుకు సాగడంలేదు. దాంతో అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణం నరకంగా మారింది. నజ్దిక్‌సింగారంలో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లను కొన్ని కూల్చడానికి అధికారులు గతేడాది గుర్తులు పెట్టారు. ఇళ్లను కూల్చకుండా నజ్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాలకు దూరంగా కొత్తగా రోడ్డు వేయడానికి గతంలో భూసేకరణ చేయడానికి అధికారులు పూనుకోగా.. ఎకరానికి రూ.35లక్షల పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేయడంతో భూసేకరణ పనులు ఆగిపోయాయి. మొగ్గుళ్లవంపు శివారు నుంచి తిరుమలేషుని గుట్ట వరకు భూసేకరణ చేసి రోడ్డు వేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా, మొగ్గుళవంపు నుంచి యాచారం అంబేడ్కర్ విగ్రహం వరకు నాలుగు లేన్ల రహదారి వేస్తారా అని స్థానికులు కలత చెందుతున్నారు. ఇదే జరిగితే కనీసం 30 ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని అక్కడి వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొగ్గుళ్లవంపు శివారు నుంచి నేరుగా తిరుమలేషుని గుట్ట వరకు మరో రోడ్డు వేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదు. కొత్తగా రోడ్డు వేయడానికి యాచారం లేదా నందివనపర్తిలోని రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.

ఆటో తరచూ రిపేర్‌కు వస్తుంది



మీర్‌ఖాన్‌పేట సమీపం నుంచి నజ్దిక్‌సింగారం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గుంత లు పడింది. మట్టి రోడ్డుపై అడుగడుగునా గుంతలుండడంతో ఆటో రెండు రోజులకోసారి రిపేర్‌కొస్తుంది. దాంతో మేం సంపాదించిన దానికంటే ఆటో మరమ్మతులకే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అధికారులు త్వరితగతిన రహదారిని బీటీ రోడ్డుగా మార్చి ఇబ్బందులు తొలగించాలి.

- పాండు, ఆటోడ్రైవర్

బస్సుల కమాన్ కట్టలు విరుగుతున్నాయ్



మీర్‌ఖాన్‌పేట నుంచి నజ్దిక్‌సింగారం గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును మట్టి రోడ్డుగా మార్చడంతో చాలా వరకు గుంతలు ఏర్పడ్డాయి. దాంతో బస్సుల కమాన్ కట్టలు విరిగిపోతున్నా యి. టైర్లు తరచూ పాడవుతున్నాయి. అధికారులు రోడ్డును బాగు చేస్తే ఎలాంటి ఇబ్బందులుండవు. 15 నిమిషాల్లో మూడుకిలోమీటర్లు వెళ్లే బస్సుకు ఆ రోడ్డుపై గంట సమయం పడుతోం ది. దాంతో సకాలంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చలేకపోతున్నాం.

- వెంకటనర్సప్ప, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం

నరకయాతన

(5వ పేజీ తరువాయి)

బీటీ రోడ్డు నిదర్శనంగా నిలుస్తుంది. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడ చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రోడ్డు మరమత్తు విషయంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారుల ఉదాసీనత, పాలక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ప్రజలకు ఆగ్రహాన్ని తెప్పిస్తుంది.

ఆరేళ్లుగా ఎదురుచూపు

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డును 15 ఏళ్ల క్రితం ఆర్అండ్‌బీ శాఖలోకి మార్చారు. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారి ఆమనగల్లు నుంచి సిర్సనగండ్ల మీదుగా మహబూబ్ నగర్ - మిర్యాలగూడ జాతీయ రహదారి చారగొండ వరకు 27 కిలోమీటర్ల రోడ్డుకు గాను నాలుగేళ్ల క్రితం 12 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టారు. మరో 15 కిలోమీటర్లు పూర్తయితే రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును ఆమనగల్లు నుంచి జంగారెడ్డిపల్లి వరకు, మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సిర్సనగండ్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. జంగారెడ్డిపల్లి గ్రామ సమీపం నుంచి చంద్రాయన్‌పల్లి వరకు మధ్యలో 10 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు చేపట్టలేదు. ఉన్న సింగిల్ రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. జంగారెడ్డిపల్లి, మాలెపల్లి, పోలెపల్లి గేటు మీదుగా చంద్రాయన్‌పల్లి వరకు కనీసం మరమ్మతులు కూడ చేయడం లేదు. గత ఏడాది గోతుల్లో, రోడ్డు పక్కన మట్టి పోసి చదును చేసినా వర్షాలకు కొద్దిరోజులకే యథాస్థితికి చేరుకుంది.



రోడ్డు విస్తరణ గూర్చి మంత్రి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)

శంకుస్థాపన చేసినా ప్రారంభించని పనులు

ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డి పల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు పాడైన బీటీరోడ్డును ఆధునీకీకరించి డబుల్ రోడ్డుగా విస్తరించాలని ఏళ్లకాలంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో బీటీ రోడ్డు నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.2.86 కోట్లు మంజూరు చేసింది. 2023 ఆగస్టు 29న పనుల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఏడాది గడిచినా పనులు ప్రారంభించలేదు. ఏడుసార్లు టెండర్లు నిర్వహించినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని సమాచారం.

మంత్రిని కలిసి విన్నవించాం..



ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు మిగిలిపోయిన బీటీ రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేయించాలని మంత్రి కోమటిరెడ్డిని కలిసి విన్నవించాం. డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్లు విడుదల చేయాలని కోరాం. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కూడా డబుల్ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.

- కల్లు వెంకటరమణారెడ్డి, చెన్నంపల్లి

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



కొత్త ఉపాధ్యాయులతో ఎంపీడీవో హిమబిందు, ఎంఈవో పురందాస్

చేవెళ్ల, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా భర్తీ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బుధవారం చేవెళ్లలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులందరూ చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు, ఎంఈవో పురందాస్ సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు. ఎంఈవో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలో మొత్తం 12 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా.. 10 మంది కొత్తగా వచ్చారని చెప్పారు. వారిలో ఎస్జీటీలు ఐదుగురు, స్కూల్ అసిస్టెంట్లు ఐదుగురు చొప్పున వచ్చారు.

విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్

కేశంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కేశంపేట ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. ప్రభుత్వం కేశంపేట మండలానికి నూతనంగా 21 మంది ఉపాధ్యాయులను కేటాయించింది. ఈమేరకు బుధవారం వారు మండల మానవవనరుల భవనంలో ఇన్‌చార్జీ ఎంఈవో సమక్షంలో విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు రామకృష్ణ, మల్లేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రోడ్లకు పెద్దపీట



సీతక్కతో జంగారెడ్డి, దెబ్బడగూడ మాజీ సర్పంచ్ శ్రావణి

కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు పెద్దపీట వేసినట్లు మాజీ జడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌లు అన్నారు. బుధవారం దెబ్బడగూడ మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణితో కలిసి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం వారు విడివిడిగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కందుకూరు నుంచి దెబ్బడగూడ వరకు రూ.2.50కోట్లతో, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కొలన్‌గూడ వరకు రూ.కోటీ 50 లక్షలు, నేదునూరు జడ్పీ రోడ్డు నుంచి మాన్యగూడ మీదుగా మద్దెల కుంట తండా వరకు రూ.8కోట్లు, గఫూర్‌నగర్ నుంచి జైత్వారం వరకు బీటీ రోడ్లకు రూ.4.50కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అందుగుల సత్యనారాయణ, కృష్ణానాయక్, జైపాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రవి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల విద్యుత్ కార్యాలయంలో భారీగా బదిలీలు

- విద్యుత్ ఏడీఈగా రాజేష్‌బాబు

చేవెళ్ల, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇందులో భాగంగా చేవెళ్ల నూతన విద్యుత్ ఏడీఈగా రాజేష్‌బాబు నియమితులయ్యారు. అలాగే చందానగర్ నుంచి బదిలీపై చేవెళ్లకు నూతన ఏఈగా రాజేందర్ వచ్చారు. జూబ్లీహిల్స్ నుంచి బదిలీపై షాబాద్ ఏఈగా కోటేశ్వర్‌రావు వచ్చారు. ఈ మేరకు అధికారులు బుధవారం చేవెళ్లలో బాధ్యతలు చేపట్టారు. అయితే, చేవెళ్లకు వచ్చిన రాజేష్‌బాబు చిలుకూరు ఏఈగా ఉంటూ పదోన్నతిపై చేవెళ్లకు ఏడీఈగా వచ్చారు. చేవెళ్లలో ఇది వరకు ఏడీఈగా పనిచేసిన స్వామి డీఈగా పదోన్నతిపై సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు. చేవెళ్లలో పనిచేసిన ఏఈ జానీమొయినొద్దీన్ కందుకూరు మండలానికి బదిలీ అయ్యారు. అలాగే షాబాద్‌లో ఏఈగా పనిచేసిన నరేందర్ అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ అయ్యారు. దాంతో పాటు చేవెళ్ల మండలంలో లైన్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ మణికొండలోని డీఈఈ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొయినాబాద్‌లో పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి చేవెళ్లకు రానున్నారు. అలాగే కమ్మెట లైన్‌మ్యాన్ భిక్షపతి, కందవాడ లైన్‌మెన్ మధుసూదన్‌రెడ్డి, ఖానాపూర్ లైన్‌మెన్ వెంకటయ్యలు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

విద్యుత్ ఏఈగా రమేష్‌గౌడ్



కొత్తూర్, 16(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ శాఖ ఏఈగా రమేష్‌గౌడ్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన సాయికృష్ణ షాద్‌నగర్ విద్యుత్ కార్యాలయానికి బదిలీ అయ్యాడు. కందూకూరు ఏఈగా విధులు నిర్వహిస్తూ రమేష్‌గౌడ్ కొత్తూర్‌కు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

షాబాద్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీస్‌లు కథనం ప్రకారం.. మండల పరిధిలోని కేశవగూడకు చెందిన తోటమీది యాదయ్య(35) గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 15న చేపలు పట్టుకుని వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. షాబాద్ మండల కేంద్రంలో ఉన్న పైల్వాన్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి అందులో పడి చనిపోయాడు. బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో శవం చెరువులో తేలడంతో గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

భూమి డబుల్ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

- నలుగురిపై కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నందిగామ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామానికి చెందిన కేశంపేట రాజలింగంకు సర్వేనంబర్ 128లో 8 గుంటల భూమి ఉండగా నలుగురు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి భూమిని వారిపేరుపై ఎక్కించుకున్నారని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీకాంత్‌గౌడ్, కొండారెడ్డి సాగర్, అమిత్ అగర్వాల్, మామిళ్లపల్లి నర్సింలు దొంగ పత్రాలు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ నందిగామ పోలీస్‌స్టేషన్‌లో రాజలింగం ఫిర్యాదు చేశాడు. కాగా, వారంతా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అనుచరులని, తనను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజలింగం ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి రిమాండ్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం బూరుగడ్డ తండాకు చెందిన నేనావత్ లచ్చిరాం ఈ నెల 13న ఇంటికి తాళం వేసి దసరా సందర్భంగా బంధువుల గ్రామానికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. అదేరోజు రాత్రి అదే తండాకు చెందిన మునిరాం తాళం విరగ్గొట్టి 50 తులాల వెండి కడియాలు, రూ.9,800 నగదు ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



యాదగిరి

కేశంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దత్తయాపల్లిలో వ్యక్తి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం సూరారం గ్రామానికి చెందిన గడ్డల యాదగిరి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దసరాను సందర్భంగా ఈనెల 12న అత్తగారి ఊరైన కేశంపేట మండలం దత్తాయపల్లికి భార్య లక్ష్మితో వచ్చాడు. మరుసటి రోజు 13న ఉదయం హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. పండగ అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి చూడగా భార్యకు కనిపించలేదు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ కార్మికులకు వారాంతపు సెలవులివ్వాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చౌదరిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మురికివాడలో పనిచేసే జీపీ కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీవో లాలయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని అమలు చేసి కార్మికులతో గ్రామ పంచాయతీలో పని చేయిస్తుందని, అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. అనంతరం ఎంపీవో మాట్లాడుతూ ఉన్నతాధికారులకు విషయం తెలిపి సమస్య పరిష్కారమయ్యేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు. టీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, నాయకులు రాములు, జంగయ్య, సత్యనారాయణ, యాదమ్మ, రఫీ, సత్తయ్య, రత్నమ్మ, శేఖరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీలో సమస్యలు గుర్తించాలి

చౌదరిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. వన మహోత్సవంలో భాగంగా నర్సరీలో మిగిలిన మొక్కలను నాటించాలని సూచించారు. కొందుర్గు ఇన్‌చార్జి ఎంపీవో లాలయ్య, కార్యదర్శులు పాండురంగం గౌడ్, రాములు, అనూష, సౌజన్య, యాదయ్య, ఈసీ లక్ష్మారెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, అందుకోసం అన్ని వసతులతో కూడిన ఆసుపత్రులు ఏర్పాటు కావడం అభినందనీయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన విశిష్ట మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా కాకుండా రోగులకు మంచి వైద్యం అందించే దిశగా ముందుకుసాగాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, మధుమోహన్, ఆర్.రాజు, సుధాకర్, విలాస్, శ్రీనివాస్‌నాయక్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు హర్షణీయం

చేవెళ్ల, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలో పలు గ్రామాలకు రీ బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేవెళ్ల మండల కేంద్రం నుంచి ముడిమ్యాల్ వయా మల్కాపూర్ మీదుగా రీ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 3.35 కోట్లు నిధులను విడుదల చేసిందన్నారు. గత నెలలో ముడిమ్యాల్, కమ్మెర, మల్కాపూర్ గ్రామస్తులు తనను కలువడంతో మంత్రి సీతక్కకు లేఖ రాసానని, మంత్రి స్పందించి నిధులు మంజూరు చేయడం చాలా సంతోషకరమన్నారు. మండల ప్రజల తరఫునన మంత్రి సీతక్కకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎంపీ పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన జంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మధుసూదన్‌రెడ్డికి నాయకుల శుభాకాంక్షలు





మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బొక్క జంగారెడ్డి, తదితరులు

షాబాద్/కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డికి షాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నగరంలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మధుసూదన్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు షాబాద్ మండల నుంచి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సుభాష్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. అలాగే మధుసూదన్‌రెడ్డికి మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు నర్సింహారెడ్డి, రాంరెడ్డి, శ్రీధర్, కంబల్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.వీరారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పశువులకు 'గాలికుంటు' నివారణ టీకాలు వేయించుకోవాలి

యాచారం/ఆమనగల్లు,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు విధిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రేఖ సూచించారు. బుధవారం యాచారం పంచాయతీ పరిధిలోని మాల్, మొగ్గుళ్లవంపు గ్రామాల్లో పాడిపశువులకు టీకాలు వేశారు. ప్రతీ గ్రామం తిరిగి టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. రైతులు మండల కేంద్రానికి లేదా మేడిపల్లికి పశువులను తీసుకెళ్లి టీకాలు వేయించుకోవాలని కోరారు. బుధవారం 130 ఆవులు, 284 గేదెలకు టీకాలు వేశామన్నారు. అలాగే ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారి అగ్నిగేశ్ ఆధ్వర్యంలో 77 గేదెలు, 82 ఆవులకు టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పశువైద్య సిబ్బంది బురానొద్దీన్, సులేమాన్, యాదయ్య, పాలాక్ష, గోపాలమిత్రలు తదితరులున్నారు. అదేవిధంగా తలకొండపల్లి మండలం వెల్జాలలో డా.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో టీకాలు వేశారు.

అంగన్‌వాడీ టీచర్‌కు ఘనంగా వీడ్కోలు

చౌదరిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్పూర్ అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన శారదమ్మకు గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ సర్పంచులు నర్సింహారెడ్డి, బాలయ్య, రాజేందర్, కొయ్యాల నర్సింలు, అంజి, రాజు, ద్విజేందర్, నర్సింహులు, రాంచంద్రయ్య, యాదయ్య తదితరులున్నారు.



శారదమ్మతో గ్రామస్తులు, పిల్లలు

తాటి, ఈత చెట్లను నరికితే కఠిన చర్యలు



ముద్విన్‌లో అవగాహన కల్పిస్తున్న బద్యనాథ్

ఆమనగల్లు/మాడ్గుల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా తాటి, ఈత, కర్జూర చెట్లను నరికితే ఎంతటి వారైన కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. తాటి, ఈత కల్లులో మత్తు పదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో బుధవారం సీఐ బద్యనాథ్ చౌహాన్ పర్యటించారు. ఎక్సైజ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా ఈత, తాటి చెట్లను, గెలలను నరికితే ఎక్సైజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ఆయా మండలాల పరిధిలోని పలు గ్రామాలలో రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గీత కార్మికులకు సీఐ అవగాహన కల్పించారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైన తాటి చెట్లు, ఈత చెట్లు వెంచర్లలో తొలగించిన వెంటనే ఫొటోలు, వీడియోలు తీసి 8712658742, 9000571671 నెంబర్లకు పంపించాలని కోరారు.

మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

షాద్‌నగర్ అర్బన్, 16(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27న నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్‌మాల పిలుపునిచ్చారు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో బుధవారం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు అర్జున్‌కుమార్, రామచందర్, మహేందర్, మహేష్, జగన్, వినోద్, నర్సింహులు, శ్రీను, శేఖర్, అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **షాద్‌నగర్ అర్బన్** : ముదిరాజ్‌లు విద్యాభివృద్ధిని సాధిస్తేనే ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో టీకొట్టు నడిపిస్తున్న బైరమోని రమేష్ మంజుల దంపతుల కుమార్తె మేఘన ఎంబీబీఎస్ సీటు సాధించింది. బుధవారం అందె బాబయ్యతో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు మేఘనను సన్మానించారు.
- **ఆదిభట్ల** : కాలనీలలో అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై పి.రాజు సూచించారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్, జైసూర్యపట్నం, అంబేడ్కర్ నగర్ కాలనీలో పర్యటించి మహిళలు, కాలనీవాసులు, యువకులతో మాట్లాడారు. కాలనీలలో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.
- **ఆమనగల్లు** : ఆమనగల్లు మున్సిపాలిటీ ఆదర్శనగర్ కాలనీకి చెందిన వీరమల్ల మూర్తి ఊర్మిళ దంపతుల కుమారుడు సాయినాథ్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ 1,01,566, రాష్ట్రస్థాయిలో 1345 ర్యాంక్ సాధించాడు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో సీటు లభించింది.
- **తలకొండపల్లి** : దేశ భద్రత, అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. జూలపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా కుమార్ హాజరై సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు.